క్లుప్తంగా

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న బీజేవైఎం, బీజేపీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ నినాదం వికసిత్ భారత్ అని బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం నగరంలోని వై జంక్షన్ సమీపంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి జంగం వెంకట సుబ్బారెడ్డి, కడప జిల్లా సభ్యత్వ నమోదు ప్రతినిధి రామకృష్ణారెడ్డి, బీజేవైఎం జనరల్ సెక్రటరీ సురేంద్ర, ఉపాధ్యక్షులు ప్రవీణ్, శ్రీకాంత్, వినోద్, సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 12వ డివిజన్ ఫక్కీరుపల్లె యూత్ ఆధ్వర్యంలో వినాయకుడిని ఘనంగా నిమజ్జనానికి తరలించారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి హాజరై డివిజన్ నాయకులు ఎం. జయరాం ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వినాయక లడ్డు వేలం పాట నిర్వహించారు. రూ. 40 వేలకు ఫక్కీరుపల్లెకు చెందిన పెయ్యల కుటుంబ సభ్యులు సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

నగరాన్ని శుభ్రంగా ఉంచాలి



తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర

కడప కార్పొరేషన్: కడప నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర అన్నారు. చెన్నూరు బస్టాండ్, అల్మాస్ పేట, నకాష్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెన్నూరు బస్టాండ్ వద్ద పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించి, వీధుల్లో చెత్త పాయింట్లను ప్రతిరోజూ శుభ్రం చేయాలని ఆదేశించారు. నకాష్, అల్మాస్ పేటల్లో పెద్ద కాలువల పూడికలను తొలగించి, వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పునర్ వినియోగం, వ్యర్థాల సరైన నిర్వహణ వల్ల ఆరోగ్య సమస్యలను తగ్గించవచ్చన్నారు. స్వచ్ఛత మన బాధ్యతని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే కడప నగరం పరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఆశాల విధులు ఎంతో కీలకం

కడప రూరల్ : ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు చేపట్టే ఆశా కార్యకర్తల విధులు ఎంతో కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇతర వైద్య సిబ్బందితో కలిసి ఆశాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సమిష్టిగా పనిచేయాలని తెలిపారు.

పదోన్నతుల అవకాశం కల్పించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 1989 డీఎస్సీకి చెందిన అభ్యర్థులకు ప్రభుత్వం పదోన్నతుల అవకాశం కల్పించాలని ఎస్టీయూ కడప జిల్లా శాఖ అధ్యక్షులు ఇలియాస్ బాష, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సురేష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల గంగిరెడ్డి కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1989 డీఎస్సీకి చెందిన అభ్యర్థులకు పదోన్నతులు పూర్తికావచ్చినా కోర్టు కేసుల వలన ప్రమోషన్ పొంద లేకపోయారని అన్నారు. వారికి పదవీ విరమణ వయసు దగ్గర పడుతుందన్నారు. అర్హత ఉన్న వారికి సోషియల్ సబ్జెక్టుల్లో ప్రమోషన్ అవకాశం కల్పించాలని కోరారు.

ప్రైవేట్ పరం చేయడం తగదు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది అనుకుంటే పొరబాటే. పేద ప్రజలపై భారం మోపేందుకు అనేక అడ్డదారులు తొక్కుతోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలలో ఫీజులు తక్కువగా వుంటాయని, సూపర్ స్పెషాలిటీ వైద్యం పేదలకు అందుబాటులోకి వస్తుందని ప్రజలు ఎంతో ఆశపడ్డారు. అయితే ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ప్రస్తుతం వున్న కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలనుకోవడం తగదు. ఇది పేద విద్యార్థులను మోసం చేయడమే. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలి.
- సుబ్బారావు, కడప



ప్రజలకు మేలు చేయాలి



నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఒక్కొక్కటే తీసివేస్తూ రావడం బాధాకరం. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి ప్రజల నడ్డి విరుస్తోంది. గత ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలను మంజూరు చేయించింది. దీనివల్ల రాష్ట్రానికి అదనంగా దాదాపు 1800 మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల ఆశలపై ఈ కూటమి ప్రభుత్వం నీరు చల్లుతోంది. మెడికల్ కళాశాలల విషయంలో ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా మెడికల్ సీట్లు పేద విద్యార్థులకు దక్కకుండా ప్రైవేటుకు అప్పజెప్పాలనుకుని నిర్ణయించుకోవడం దుర్మార్గపు చర్య. - సోదాదాసి శామ్యూల్‌రాజ్, కడప

చదువులమ్మ చెట్టునీడలో..

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. రెండు పదుల వయసులో కళాశాలకు చెంగు చెంగున వచ్చిన ఆనాటి విద్యార్థులు నేడు.. ఎనిమిది పదులు, తొమ్మిది పదుల వయసులో ఊతకర్రల సాయంతో సైతం కళాశాల సంబరాలకు విచ్చేసి కళాశాల పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కళాశాలతో తమకున్న అనుబంధాన్ని తమతోటి మిత్రులు, జూనియర్లు, సీనియర్లతో పంచుకుంటూ సందడి చేశారు. కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకుంటూ.. కుశల ప్రశ్నలతో సంతోషాన్ని పంచుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన పైలాన్ వద్ద ఫొటోలు దిగుతూ.. తాము చదివిన తరగతి గదుల వద్దకు వెళ్లి చూసుకుని మురిసిపోయారు. కళాశాలలో ఉన్న ఆనాటి గ్రూప్ ఫొటోలను ఫొటో తీసుకుని భద్రంగా దాచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను గుర్తుకు చేసుకుని, వేడుకలకు విచ్చేసిన గురువులను సన్మానించారు. కళాశాల తొలి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రామసుబ్బారెడ్డి, నాగమునిరెడ్డిలు సైతం 85 ప్లస్ వయసులో కళాశాల వేడుకలకు రావడం ఎందరికో స్ఫూర్తి కలిగించింది. ఎక్కడో పుట్టాం.. ఇక్కడే చదివాం.. ఎక్కడో ఉంటున్నాం.. మళ్లీ ఇలా కలిసే అవకాశం రావడం సంతోషాన్నిచ్చిందని పలువురు పూర్వ విద్యార్థులు తమ ఆనందాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

కళాశాల అభివృద్ధిలో భాగం కావడం సంతోషంగా ఉంది..



పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కళాశాలలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి కళాశాల అభివృద్ధిలో భాగస్వామినయ్యాను. కళాశాల మాలాంటి వారికి ఎన్నో అవకాశాలను ఇచ్చింది. మా ఉన్నతికి దోహదం చేసిన కళాశాలను ఎప్పటికీ మరువలేం. కళాశాల అభివృద్ధికి పాటుపడతాం. - ఎం. వెంకటశివారెడ్డి, (1975–80, బీఎస్సీ బీజెడ్‌సీ), మాజీ ఎమ్మెల్సీ, కడప

ప్రతిభావంతులకు గోల్డ్‌మెడల్ అందించనున్నాం



కళాశాల మాకు ఎంతో ఇచ్చింది. మా వంతుగా కళాశాల అభివృద్ధి కోసం రూ.1.50 లక్షలు అందజేశాం. జీపీసీ గ్రూపులో ప్రథములుగా వచ్చిన విద్యార్థులకు సజ్జల దివాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం గోల్డ్‌మెడల్, జ్ఞాపిక అందజేసేలా డిపాజిట్ చేయమని కోరాం. మా మిత్రులు, జూనియర్స్, సీనియర్‌లను కలుసుకోవడం సంతోషంగా ఉంది.
- సజ్జల జనార్థన్‌రెడ్డి, (1963–66 బ్యాచ్ బీఎస్సీ ఎంపీసీ) విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, కడప



75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ పైలాన్ వద్ద పూర్వ విద్యార్థులు



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న పూర్వ విద్యార్థులు

కళాశాల ఎంతో ఇచ్చింది..



రైల్వేకోడూరు ప్రాంతం నుంచి ఇక్కడికి విచ్చేసి ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో చదువుకున్నాను. కళాశాల మాకు ఎన్నో నేర్పింది. మేము ఉన్నతస్థానాల్లో పనిచేయగలిగామంటే కళాశాల ఇచ్చిన స్ఫూర్తే అని భావిస్తాం. 75 సంవత్సరాల వేడుకల్లో పాల్గొనడం మరిచిపోలేని అనుభూతి. గతంలో ఎస్వీయూ, వైవీయూలో పలు హోదాలలో బాధ్యతలు నిర్వహించా.
- ఆచార్య కె. చంద్రయ్య, (1778–83 సైకాలజీ), విశ్రాంత మనోవిజ్ఞానశాస్త్ర శాఖ ఆచార్యులు, ఎస్వీయూ, తిరుపతి

నేను, నా భర్త ఇద్దరం ఇక్కడే చదివాం..



నేను, నా భర్త సత్యనారాయణరెడ్డి ఇదే కళాశాలలో చదివి, వైవీయూలో ఇద్దరూ ప్రొఫెసర్లుగా పనిచేసి రిటైర్డ్ అయ్యాం. కళాశాల వేడుకలు చాలా బాగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. మరచి పోలేని ఓ అనుభూతి. - ఆచార్య టి. వాసంతి,(1977–80 బ్యాచ్ బీఏ ఎంఈఎస్), విశ్రాంత ప్రధానాచార్యులు, వైవీయూ

ప్లాటినం జూబ్లీ వేడుకలు.. ఓ మధురానుభూతి

ఆర్ట్స్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. కళాశాలలోకి వచ్చిన వెంటనే ఏదో తెలియని ఆనందం కలిగింది. పాత మిత్రులను చూడగానే కలిగిన ఆనందం వర్ణించలేనిది. వృత్తి రీత్యా వివిధ ప్రాంతాల్లో పనిచేసినా, కళాశాల వేడుకలు అనగానే ఇక్కడికి విచ్చేశాం. ఆనాటి మిత్రులను కలవడం చాలా సంతోషంగా ఉంది. జీవితంలో ఇదొక మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది.
- సురేంద్రనాథ్‌రెడ్డి, (1978–81 బ్యాచ్ బీఏ హెచ్ఈటీ), విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, విజయవాడ

విజయవంతంగా వేడుకలు..



ప్లాటినం జూబ్లీ వేడుకల కోసం గత కొద్ది నెలలుగా శ్రమిస్తూ వచ్చాం. అందరి సమిష్టి సహకారంతో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాం. వేల సంఖ్యలో పూర్వ విద్యార్థులు తరలిరావడం చూస్తుంటే కళాశాల పట్ల ఉన్న అభిమానం అర్థమవుతోంది. - ఆచార్య పి. రాజశేఖరరెడ్డి, (1971–74 బ్యాచ్), సిల్వర్‌జూబ్లీ సెలబ్రేషన్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్

వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది..



లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యనందించిన కళాశాల నేడు 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. గతంలో అధికారిగా ఎన్నోసార్లు కళాశాలకు వచ్చినా, ఈ వేడుకల్లో పూర్వ విద్యార్థిగా పాల్గొనడం సంతోషంగా ఉంది.
- ఆచార్య ఎం. రామకృష్ణారెడ్డి, (1978–80 బీఎస్సీ జీపీసీ), విశ్రాంత వైస్ చాన్సలర్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం

కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులర్ చేయాలి



రిలే దీక్షల్లో పాల్గొన్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులు

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను వెంటనే రెగ్యులర్ చేయాలని 'నర్సెస్ స్ట్రగుల్ కమిటీ'(ఎన్.ఎస్.సి) నాయకులు డిమాండ్ చేశారు. కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ఎన్ఎస్సీ జిల్లా అధ్యక్షురాలు బి. విజయశ్రీ, వైస్ ప్రెసిడెంట్ ఎన్.హేమలత, జనరల్ సెక్రటరీ కమాల్‌బీ, ట్రెజరర్ నారాయణ, కమ్యూనికేటర్ ఏ.సునీతలతో పాటు నర్సులు, మేల్ నర్సింగ్ సిబ్బంది ఈ దీక్షలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 14 సంవత్సరాల నుంచి రెగ్యులర్ నోటిఫికేషన్‌ను స్టాఫ్ నర్సులకు ప్రకటించలేదన్నారు. జీఓ 115లో ప్రకారం ఇప్పటికే రెగ్యులర్, కాంట్రాక్ట్‌లలో వుండి 18 నెలలు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో శిక్షణ తీసుకున్న ఎ.ఎన్.ఎంలకు రూ. 5 వేలు ఒక్కొక్కరికి ఇచ్చి.. రెగ్యులర్ ఏఎన్ఎంలను రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా, కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పిస్తూ ఖాళీ స్టాఫ్ నర్సుల ఉద్యోగాలలో భర్తీ చేస్తున్నారన్నారు. దీనివలన గత 10 నుంచి 15 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులకు, చదువుకుని వున్న నిరుద్యోగ స్టాఫ్ నర్సులకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జీవో నెం. 115ని రద్దు చేయాలని, లేని పక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు.

విద్యార్థిపై దాడి

కడప అర్బన్: రిమ్స్‌లో అప్రెంటిషిప్ చేస్తున్న యువరాజ్ నాయక్‌పై అక్కడ ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మోహన్‌నాయక్ శుక్రవారం దాడి చేసి గాయపరిచాడు. యువరాజ్ నాయక్‌కు, మోహన్‌నాయక్‌కు మనస్పర్థలు వుండటంతో ఈ సంఘటన జరిగినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంటలసాగులో మెలకువలు అవసరం



మాట్లాడుతున్న ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసాచారి

కడప అగ్రికల్చర్: వాతావరణ మార్పుల నేపథ్యంలో పంటలసాగులో రైతులకు మెలకువలు చాలా అవసరం అని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శ్రీనివాసాచారి అన్నారు. కడప ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 'ప్రధాన పంటల్లో పురుగులు – తెగుళ్ల యాజమాన్యం' పైన ఆత్మ సౌజన్యంతో గ్రామీణ యువతకు శిక్షణతో కూడిన నైపుణ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు, ఆత్మ పీడీ విజయలక్ష్మి, కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్‌లు హాజరయ్యారు. శ్రీనివాసాచారి మాట్లాడుతూ పంటలసాగులో పురుగులు, తెగుళ్లతో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటలకు ఏదైనా తెగులు సోకగానే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పురుగుమందులు వాడుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు మాట్లాడుతూ పంటలసాగుకు అవసరం మేరకు నీటి తడులను అందించాలన్నారు. కలుపు మందుల వాడకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.

కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్యకుమార్, సీనియర్ శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డిలు పంటల్లో విత్తనోత్పత్తి, జీవన ఎరువుల, వర్మికంపోస్టు ఎరువుల ఉపయోగాలపై వివరించారు. వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు పుట్టగొడుగుల ఉత్పత్తిపై వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ లిటరసీ 30 రోజుల సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ రెగ్యులర్ పాఠాలతో పాటు విద్యార్థులకు అదనంగా ఉపయోగపడేలా డిజిటల్ లిటరసీ సర్టిఫికెట్ కోర్సు తీసుకురావడం అభినందనీయమన్నారు. అర్థశాస్త్ర విభాగాధిపతి డా. జి. విజయలక్ష్మిదేవి డిజిటల్ లిటరసీ కోర్సు స్వరూపం గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఎం. గురుమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పీవీ సుబ్బారెడ్డి, నాగవేణి, రవిశేఖర్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షకులు అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.


గోడలపై పోస్టర్లు, స్టిక్కర్లు అతికించరాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నాగేంద్ర

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రహరీలు, ప్రైవేటు బిల్డింగులు, గోడలు, సర్కిళ్లు, డివైడర్లు, సెంట్రల్ మీడియన్లపై ఎలాంటి వాల్‌పోస్టర్లు, నోటీసులు, స్టిక్కర్లు అతికించడంగానీ, ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం చేయకూడదని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర అన్నారు. శుక్రవారం సినిమా థియేటర్ల యజమానులు, వివిధ మత సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరపాలక సంస్థ అనుమతి లేకుండా కడప నగరంలో ఎక్కడా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదని, అలా చేసిన వారిపై సీఆర్‌పీసీ సెక్షన్ 133 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి పొందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు మూడు రోజుల తర్వాత వారంతట వారే తొలగించాలన్నారు. లేనిపక్షంలో కడప నగరపాలక సంస్థ వాటిని తొలగించి అందుకయ్యే ఖర్చు వారి నుంచి వసూలు చేస్తామన్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయుటకు రోడ్లపై గుంతలు తవ్వితే అపరాధ రుసుం విధించి క్రిమినల్ కేసు దాఖలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



సీఎంకు చెక్కును అందజేస్తున్న బ్యాంకు చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్, జీఎం పడగెట్వార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన విజయవాడ వాసులను ఆదుకునేందుకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది తనవంతుగా చేయూతనందించారు. గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది, అసోసియేషన్ నాయకులు, జనరల్ మేనేజర్లు కలిసి తమ ఒకరోజు వేతన మొత్తం రూ. 86 లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. ఈ మేరకు బ్యాంకు చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్, జనరల్ మేనేజర్ పడగెట్వార్ ఆర్థికసాయం చెక్కును సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు.

ఆటల పోటీలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూయూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. శుక్రవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిరంతరం బోధనతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు మానసికోల్లాసాన్ని కల్పించడానికి జిల్లా స్థాయిలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, పరుగు పందేలు, స్పీడ్ వాకింగ్ మొదలైన ఆటలను మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు వీరనారాయణ, నాగిరెడ్డి, గోపినాథ్,అబ్దుల్ గని, ఎంవీఎస్ రాజు పాల్గొన్నారు.

'ఏచూరి' పోరాటం స్ఫూర్తిదాయకం



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు

కడప కల్చరల్ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ఉద్యమానికి అందించిన మద్దతు, సహకారం అమూల్యమైనదని, ఆయన ప్రభుత్వ రంగ సంస్థల ఆప్త మిత్రుడని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయ ఆవరణలో డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థి నాయకుడిగా, కార్మిక వర్గ శ్రేయోభిలాషిగా, సమస్యలపై ఇతరులను ఒప్పించగలిగిన సామర్థ్యం ఉన్నవాడిగా ఆయన ప్రతిభ అనితర సాధ్యమన్నారు. విదేశీ వ్యవహారాలలో ఆయన దిట్ట అని అన్నారు. రాజ్యసభ ఎంపీగా ఆయన పనితీరు కారణంగా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. ఎల్ఐసీ, జీఐసీ సంస్థలు ప్రభుత్వ రంగంలోనే ఉండాలని ఆయన గట్టి పట్టుదలగా ఉండేవారని, తన సహకారం బీమా ఉద్యోగ సంఘాలకు ఎప్పుడూ ఉండేదని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, చంద్రపాల్, అమీనా పర్వీన్, వసుప్రద, కెసిఎస్ రాజు, అయ్యవారు రెడ్డి, రఘు, అప్పయ్య, చిన్నయ్య, గౌస్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, ఆయన పోరాటాలు యువతకు, భావి తరాలకు స్ఫూర్తిదాయకమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్ తెలిపారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవై ఎఫ్ఐ నగర కన్వీనర్ విజయ్, నాయకులు ఉదయ్, రఘు పాల్గొన్నారు.

– ఆప్ కీ ఆవాజ్ నేతలు శుక్రవారం ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో ఏచూరి మృతి పట్ల సంతాపం తెలియజేశారు. ఆయన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు

